నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 25 జూన్ 2024 | NALGONDA

అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి

మున్సిపాలిటీల అభివృద్ధిపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

హుజూర్‌నగర్, జూన్ 24 : సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ మున్సిపాలిటీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై సోమవారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోదాడ మున్సిపాలిటీ పరిధిలో పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధికి రూ.8కోట్లు, టౌన్ హాల్ నిర్మాణానికి రూ.6కోట్లు , ఖమ్మం ఎక్స్ రోడ్డు అభివృద్ధికి రూ.50 లక్షలు, మున్సిపాలిటీ పరిధిలో హైదరాబాద్ – విజయవాడ రోడ్డులో స్వాగత తోరణాలకు రూ.1.10 కోట్లు, చెరువు కట్ట బజార్ నుంచి అనంతగిరి రోడ్డు వరకు అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.4.40 కోట్లు విడుదల చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కోదాడ మున్సిపాలిటీలో అదనపు అవుట్ సోర్సింగ్ శానిటరీ సిబ్బంది ఏర్పాటుకు ఆమోదం, హుజూర్ నగర్ మున్సిపాలిటీలో ఈద్గాహ్, శ్మశాన వాటికలు, సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.3కోట్లు, గోవిందాపురంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లు, దోబీఘాట్ నిర్మాణానికి రూ.2కోట్లు, మున్సిపాలిటీకి స్వీపింగ్ మిషన్, నేరేడుచర్ల మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులకు రూ.15కోట్లు విడుదల చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఎంఏ అండ్ యుడీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వారానికి రెండు సార్లు సమీక్ష

- ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూన్ 24 : ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, ఇక నుంచి వారానికి రెండు మార్లు ప్రజావాణి దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు మండల, జిల్లా స్థాయి అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో ఎన్నికలు పూర్తయినందున అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ ప్రజావాణిలో 108 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 68, డీఆర్‌డీఓ 7, డీపీఓ 6, ఇతర శాఖలకు సంబంధించినవి 27 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు క లెక్టర్లు సీహెచ్ ప్రియాంక, బీఎస్ లత, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీఈఓ అశోక్, సీపీఓ కిషన్, డీఎస్ఓ మొహన్‌బాబు, డీఎంఓ శర్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

బాధితులకు భరోసా కల్పించండి

- సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట సిటీ, జూన్ 24 : జిల్లాలో శాంతిభద్రతలు, పౌరుల రక్షణే లక్ష్యంగా పని చేస్తానని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో నేరాలు, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి వాటి నివారణకు కృషి చేస్తామన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచుతామని, పెట్రోలింగ్ పటిష్టంగా చేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ నిర్వహిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల రక్షణ, అక్రమ కార్యకలాపాల నివారణ, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని చెప్పారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగకుండా చూస్తామని, యువత నేరాలకు పాల్పడకుండా అవగాహన కల్పిస్తామని అన్నారు. అంతకుముందు బాధ్యతలు స్వీకరించిన ఎస్పీకి అడ్మిన్ అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వర్‌రావు, ఆర్మ్‌డ్ అదనపు ఎస్పీ ఆర్.జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, మట్టయ్య, శ్రీనివాస్ రావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు గౌరవ వందనం చేసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

పోలీసు అధికారులతో సమావేశం

బాధ్యతలు చేపట్టిన ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు పోలీసు సేవలపై పలు సూచనలు చేశారు. సిబ్బంది ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విజువల్ పోలీసింగ్ స్నేహపూర్వకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులు, బాధితులకు భరోసా కల్పించాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్స్ ఉన్న వారి కదలికలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పెట్రోలింగ్ పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ఆంధ్రాకు సరిహద్దుగా ఉన్నందున నిఘా కట్టుదిట్టంగా ఉండాలని, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చూడాలని సూచించారు. గంజాయి వినియోగం, సరఫరా లేకుండా క్షేత్ర స్థాయిలో నిర్మూలించాలని సూచించారు. రాత్రి వేళ రోడ్లపై ఆకతాయిలను, అనవసరంగా తిరిగే వారిని అదుపు చేయాలన్నారు.

సీఎంఆర్ దుర్వినియోగం.. ఎంకేఆర్ రైస్ మిల్లు ఓనర్‌పై కేసు

గరిడేపల్లి, జూన్ 24 : సీఎంఆర్ ధాన్యం దుర్వినియోగం చేసిన రైస్ మిల్లు యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఎంకేఆర్ రైస్ మిల్లుకు 2022 – 23 యాసంగి, 2023– 24 వానకాలం సీజన్లకు సంబంధించి ప్రభుత్వం 15,794 టన్నుల ధాన్యం కేటాయించింది. ఆ ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ తిరిగి ఇవ్వకపోవడంతో సివిల్ సప్లయ్ అధికారులు మిల్లులో తనిఖీ చేశారు. 14,524 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు, నిల్వలు లేవు. సుమారు రూ.31.99 కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ పి.రాములు ఫిర్యాదు మేరకు మిల్లు యజమాని మల్లేపల్లి కరుణాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్ఎం రాజశేఖర్

నల్లగొండ సిటీ, జూన్ 24 : ఆర్టీసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా రీజనల్ మేనేజర్‌గా ఎం.రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్ఎంగా పనిచేసిన ఎస్.శ్రీదేవి సీటీఎంగా బస్ భవన్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో బస్ భవన్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌ను ఉమ్మడి నల్లగొండ ఆర్ఎంగా బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆర్ఎం రాజశేఖర్‌కు డీవీఎంలు శివశంకర్, మాధవి, డీఎం రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

రామగిరి, జూన్ 24 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ప్రథమ సంవత్సరంలో 66.52 శాతం, సెకండియర్‌లో 57.24శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డీఐఈఓ దస్రూ వెల్లడించారు. ఫస్టియర్‌లో 7,459 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 4,962మంది (66.52శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 1,007 మందికి 605 (60.08శాతం) మంది పాసయ్యారు. సెకండియర్‌లో 3,994 మందికి 2,286 మంది (57.24శాతం), ఒకేషనల్ విభాగంలో 848మందికి 481 మంది (56.72శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో

పెచ్చులూడిన స్లాబ్

మునుగోడు, జూన్ 24 : మండల కేంద్రంలోని పురాతనమైన ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ కార్యాలయ భవనం సోమవారం ఒక్కసారిగా పెద్ద శబ్దంతో స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. డీఈఈ కుర్చీ పక్కనే పెచ్చులు పడ్డాయి. సాయంత్రం కావడంతో అప్పటికే అధికారులు, ఉద్యోగులంతా విధులు ముగించుకొని ఇండ్లకు వెళ్లిపోయారు. దాంతో పెను ప్రమాదం తప్పింది.

ఆర్డ్‌బ్ల్యూఎస్ కార్యాలయంలో ఊడి కింద పడిన స్లాబ్ పెచ్చులు

ప్రజావాణికి సమస్యల వెల్లువ

ప్రజల నుంచి అనూహ్య స్పందన

- తొలి సోమవారమే 1,706 దరఖాస్తులు
- మండల స్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా చర్యలు
- వారం రోజుల్లో పరిష్కారానికి ఆదేశాలు
- తొలి రోజు పలు మండలాల్లో కలెక్టర్ పర్యటన, సమీక్ష
- ప్రజావాణి మరింత సమర్థవంతంగా అమలు : కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : గ్రామ స్థాయిలో పరిష్కరించే సమస్య మొదలు జిల్లా స్థాయి వరకు అన్నింటికీ ఒక్కటే మంత్రం అన్నట్లుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి ప్రజలు ఇప్పటి వరకు బారులు దీరేవారు. ఇది సామాన్య ప్రజలకు ఎన్నో వ్యయప్రయాసాలకు గురిచేసింది. పైగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో మెజార్టీ వాటికి అతీగతి ఉండేది కాదు. దీంతో అధికార యంత్రాంగం మీద ప్రజలకు విశ్వాసం సన్నగిల్లే పరిస్థితులు తలెత్తుతున్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటూ ఇటీవలే జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సి.నారాయణరెడ్డి.. జిల్లా పాలనాధికారిగా ప్రజల సమస్యలకు ఎక్కడికక్కడే పరిష్కారం చూపేదిశగా కార్యాచరణ రూపొందించారు. ఇక నుంచి మండల స్థాయిలోనే ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించడం వల్ల ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చే బాధలు తప్పుతాయని భావించారు. వారం రోజులుగా దీనిపైనే పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన అనంతరం సోమవారం నుంచి శ్రీకారం చుట్టారు. తొలి సోమవారమే జిల్లాలోని 33 మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహించగా.. ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. మెజార్టీ భాగం భూ సంబంధిత సమస్యలు రాగా.. పెన్షన్లు, వ్యక్తిగత సమస్యలపైనా దరఖాస్తులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలిసింది. ప్రజావాణిలో మొత్తం 1,706 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అధికార యంత్రాంగం మొత్తం ఎక్కడికక్కడే ప్రజావాణిలో పాల్గొనేలా ఆదేశాలిస్తూ.. కలెక్టర్ కూడా చింతపల్లి, నాంపల్లి మండలాల ప్రజావాణిలో స్వయంగా పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తును పరిశీలిస్తూ పరిస్థితిని సమీక్షించారు. రానున్న కాలంలో మరింత పటిష్టవంగా ప్రజావాణిని అమలు చేయనున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి ప్రకటించారు.

నాంపల్లి ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తొలి సోమవారం ప్రజావాణి పూర్తయిన అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై అన్ని సోమవారాలు మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రత్యేకించి సమస్యల పరిష్కారంపైనే మండల స్థాయి బృందాలు దృష్టి సారించాలని అన్నారు. ఏ ఒక్క దరఖాస్తు జిల్లా స్థాయికి నేరుగా రావద్దని, మండలానికి వస్తే సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం ప్రజల్లో కల్పించడమే ప్రజావాణి లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో మండల స్థాయి బృందాల పనితీరే కీలకమన్నారు. సోమవారం ఉదయం ప్రజావాణి తర్వాత సాయంత్రం గ్రామపంచాయతీ కార్యదర్శులతో కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి సోమవారం వచ్చిన ఫిర్యాదులన్నింటికీ వారంలోపు అంటే శనివారంలోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో సైతం వాటి పరిష్కారం నమోదు చేయాలన్నారు. ప్రజావాణికి వచ్చే అన్ని రకాల దరఖాస్తులను తీసుకోవాలని, గ్రామపంచాయతీల వారీగా ఆయా పథకాల కింద అర్హత ఉండే దరఖాస్తులను తీసుకొని ఒక రిజిస్టర్ నిర్వహించి, ఫైల్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. దీని ప్రకారమే పభుత్వ పథకాలు లబ్ధిదారులకు వస్తుందన్న విషయాన్ని తెలియాలని ఆదేశించారు. మండల స్థాయిలో గ్రామాల వారీగా ప్రజావాణి దరఖాస్తుల రికార్డు నిర్వహించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంపై గ్రామపంచాయతీ కార్యదర్శులతోపాటు అందరికీ అవగాహన కలిగేలా అన్ని శాఖలకు తెలుగులో సర్క్యులర్లను జారీ చేస్తామని తెలిపారు. వారంలోపు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సర్క్యులర్‌లో గ్రామ స్థాయిలో సిబ్బంది నిర్వహించే విధులు, బాధ్యతలపై స్పష్టంగా తెలియజేస్తామని, అలాగే జీఓలు, ఇతర సర్క్యులర్లతోపాటు మీ సేవలో దరఖాస్తు చేసే వివిధ రకాల అంశాలను సైతం తెలుగులో గ్రామస్థాయి వరకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయి సిబ్బందిని అన్ని విషయాల పట్ల అవగాహనతోపాటు అన్ని పనులు నిర్వహించేందుకు సమాయత్తం చేయాలని సూచించారు. ప్రత్యేకించి గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ, ఆశ, హెడ్మాస్టర్, ఉపాధి హామీ, ఐకేపీ గ్రామైక్య సంఘాలు, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయం వంటి ముఖ్యమైన ఏడు శాఖల సిబ్బంది ఒక బృందంలా ఏర్పడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వీరితోపాటు గ్రామ స్థాయిలో పనిచేసే ఇతర సిబ్బందిని చైతన్యం చేసేందుకు మండల స్థాయి బృందాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పంచాయతీల ద్వారా ధరణి సమస్యలకు పరిష్కారం

రాబోయే రోజుల్లో గ్రామపంచాయతీల ద్వారా ధరణి సమస్యలకు పరిష్కారం చూపేలా కార్యదర్శులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతామని కలెక్టర్ చెప్పారు. భూముల సమస్యలకు సంబంధించిన అన్ని అంశాలపై తెలుగులో సర్క్యులర్ పంపిస్తామని, ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ధరణిలో 34 మాడ్యూల్స్ ద్వారా రికార్డులను సరి చేసే అవకాశం వచ్చిందని, వాటి గురించి పంచాయతీ కార్యదర్శులు తెలుసుకోవాలని చెప్పారు. సమస్యల ఆధారంగా మాడ్యూల్‌లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే విధంగా తెలిసి ఉండాలని అన్నారు. వారం రోజుల్లో విద్యుత్ లూజ్ వైర్లను, లో ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేపట్టిన వారికి అడ్వాన్స్ ఇచ్చామని, పది రోజుల్లో ఆ పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. గత వారం వచ్చిన ఫిర్యాదులను వచ్చే వారం ప్రజావాణిలో ముందుగా చర్చించి ఆ అనుభవం ఆధారంగా చర్యలు తీసుకోవాలన్నారు. పత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలపై మండల స్థాయి బృందం స్పందించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణికి సంబంధించి అన్ని మండలాల్లో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజావాణి నిర్వహించే చోట హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని, దరఖాస్తులను రాసిచ్చేందుకు ప్రత్యేకంగా మనుషులను ఏర్పాటు చేయాలని ఆదే శాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జడ్పీ సీఈఓ, జిల్లా స్థాయి ప్రజావాణి ప్రత్యేక అధికారి ప్రేమ్‌కరణ్‌రెడ్డి, నోడల్ అధికారి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్, డీఈఓ పాల్గొన్నారు.

నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



నల్లగొండ జనరల్ ఆస్పత్రిలో ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

జూడాల సమ్మె

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని నిరసన

- అత్యవసర సేవలు మినహా ఇతర అన్ని రకాల సేవలు నిలిపివేత
- జూనియర్ డాక్టర్ల సమ్మెతో ఇబ్బందులు పడ్డ రోగులు

నీలగిరి, జూన్ 24 : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు (జూడాలు) సమ్మె సైరన్ మోగించారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతున్నారని, తమకు రావాల్సిన ప్రభుత్వ గ్రాంట్లు ఇవ్వడం లేదని సోమవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల అవరణలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సేవలు మినహా అన్నింటినీ నిలిపివేశారు. ఎమర్జెన్సీ సేవలు, పరీక్షల్లో ఉన్న జూడాలు మినహా మిగిలిన సుమారు మూడు వందల మందికి పైగా జూనియర్ డాక్టర్లు ఆందోళనకు దిగారు. జూడాల సమ్మెతో ఓపీకి వచ్చిన రోగులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఓపీ సేవలు నిలిచిపోవడంతో రోగులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ మెడికల్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని పలు రకాలుగా నిరసనలు తెలిపినా స్పందన రాకపోవడంతో సమ్మెకు దిగినట్లు తెలిపారు. గ్రీన్ చానల్‌లో జూనియర్ డాక్టర్ల (హౌస్ సర్జన్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, సీనియర్ రెసిడెంట్ల) స్టైఫండ్‌ను సకాలంలో పంపిణీ చేయకపోవడం వల్ల ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూనియర్ డాక్టర్లందరికీ ప్రతి నెలా 10వ తేదీలోపు స్టైఫండ్ జమ చేయాలని కోరారు. స్టైఫండ్‌ను సకాలంలో విడుదల చేయడం కోసం గ్రీన్ చానల్ నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రవాణా కోసం కొత్త బస్సుల సేకరణతోపాటు ఆసుపత్రిలో నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కళాశాలలో మూసివేసిన లైబ్రరీని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్ అందలేదని, క్యాజువాలిటీలో ఇంటర్న్ రూమ్స్, వాష్‌రూమ్స్ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర చికిత్స కోసం మందులు కూడా అందుబాటులో ఉంచడం లేదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే అబ్దుల్ సమద్, గగన్ పెరుమాండ్ల, ఉపాధ్యక్షులు రుత్విక్, సత్యసాయి కృష్ణ, రేవంత్, జాహ్నవి, జాయింట్ సెక్రటరీలు బాలు వేమిరెడ్డి, షేక్ షాబాజ్, హరీశ్, దీపిక, కోశాధికారి ఇంద్రాణి పాల్గొన్నారు.

ప్రజావాణికి వసతులు కరువు

- నకిరేకల్‌లో చెట్ల కిందే దరఖాస్తుల రాత

నకిరేకల్ ఎంపీడీఓ కార్యాలయంలో కుర్చీలు లేకపోవడంతో చెట్ల కిందే కూర్చొని దరఖాస్తు రాసుకుంటున్న అర్జీదారులు

నకిరేకల్, జూన్ 24 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సరైన వసతులు కల్పించలేదని అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కుర్చీలు వేయలేదని, మంచి నీటి సౌకర్యం కల్పించలేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజావాణి కార్యక్రమానికి తమ సమస్యలు చెప్పుకొనేందుకు 42 మంది అర్జీదారులు రాగా.. సమావేశ మందిరంలో మూడు కుర్చీలు మాత్రమే వేశారు. దాంతో అర్జీదారులు నేలపైన, అరుగుల మీద, చెట్ల కింద కూర్చుని దరఖాస్తులు రాసే పరిస్థితి నెలకొంది. ఎండ ప్రభావం ఎక్కువగా ఉండడంతో మంచినీళ్ల కోసం ఇబ్బంది పడాల్సి వచ్చింది. సమావేశ మందిరంలో అధికారుల కుర్చీల వెనుక భాగంలో ఉన్న చాంబర్‌లో వాటర్ క్యాన్లను ఉంచారు. కార్యాలయ బయట ఆవరణలో ఉంచాల్సిన వాటర్ క్యాన్లను ఆఫీస్ చాంబర్‌లో పెడితే తాము ఎలా తాగాలని అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు రెండు మార్లు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయలేదు.

ఫణిగిరి తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ విహారాలు

ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో తవ్వకాలు పూర్తి

నాగారం, జూన్ 24 : సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తవ్వకాలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి 11న మొదలుపెట్టిన తవ్వకాలు ఈ నెల 19వరకు సాగినట్లు చెప్పారు. తవ్వకాల్లో 11 విహార గదులు, 6 పిల్లర్ల ఆకారంలో యూనివర్సిటీ, సమావేశ మందిరం, ఒక కుండలో 3,733 సీసపు నాణేలు, ధాన్యాగారం, పూసలు, విరిగిన శాసనాలు, పెంకు ముక్కలు లభ్యమయ్యాయి. తవ్వకాల్లో బయల్పడిన వాటిని పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి ఫణిగిరి మ్యూజియంలో భద్రపరిచారు. ఈ తవ్వకాల్లో 7,500 మంది కూలీలు భాగస్వాములయ్యారు.

తవ్వకాల్లో బయల్పడిన నాణేల కుండ